# ఒక మంచి మనసు

- ఎం.ఎల్. సూర్యకాంతం

నల్లని కారుమేఘాలు నిండిన ఆకాశంలో ప్రళయాన్ని సృష్టించే ఉరుములు, మెరుపుల్లా, రెక్కలు తెగిన పక్షిలా గోడకు నిస్త్రాణంగా చేరగిలబడిన దమయంతి మనసులో ఎన్నెన్నో ఆలోచనలు. భవిష్యత్ అంధకారంగా, అగమ్యగోచరంగా కనిపించసాగింది. ఏం చేయాలో తెలియని వెర్రిదానిలా అలా ఇంటికప్పుకేసి గంటల తరబడి చూస్తున్నా సమస్యకి పరిష్కారమే కనబడదు.

కష్టంలోగానీ, ఆనందంలోగానీ మనసులోని భావాన్ని పంచుకునే ఆత్మీయులుగానీ, స్నేహితులుగానీ లేకపోవడం ఎంత దురదృష్టకరం అని తనకు తానే సానుభూతి చూపుకుంది.

శ్రీధరం మామయ్య అనే దూరపు బంధువు అన్న మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

''మీ అత్తయ్యకు ఎలాగూ ఆరోగ్యం బాగాలేదు కదా. ఇక్కడ ఏ దిక్కూ లేకుండా ఒంటరిగా ఎంత కాలం ఉంటావ్. ఒకవేళ వున్నా రిజిస్టర్ మ్యారేజీ చేసుకుంటా. నాతో వచ్చేయ్. నీకే లోటు రానివ్వను. ఆ ఇద్దరు పిల్లల్నీ, మీ అత్తనూ జాగ్రత్తగా చూసుకుందువుగానీ'' అన్నాడు.

అత్తయ్యకి కేన్సరని తెలుసు. ఇప్పటికే చిన్న ఇల్లు ఒకటుందనీ, రోగిష్టి భార్యనూ, పిల్లలను సాకేందుకు బాధ్యతగల బానిస కావాలి. అందుకు తల్లిని కోల్పోయి ఒంటరిదైన దమయంతి అయితే బావుంటుందని అతని ఆలోచన.

దమయంతి వైవాహిక జీవితం గురించి ఆమె తల్లి ఎన్ని కలలు కన్నదో! నేడు ఆ కలలన్నీ కల్లలైపోయాయి. తల్లి పొదుపు సంఘంలో చేరి పెళ్లికని ఓ పాతికవేలు దాకా పోగుచేసింది. విస్తర్లు కుట్టి, మిషను కుట్టీ పైసా పైసా కూడబెట్టింది. పిచ్చి అమ్మ! నిజంగా ఆ పాతికవేలతో తన పెళ్లి చేయగలిగేదా? ఊళ్ళోవున్న హైస్కూల్లో పది పాసయ్యాక కాలేజీకి పొరుగూరుకు వెళ్తానంటే పంపలేదు. పరిస్థితి అర్థం చేసుకుని తను మారాం చేయలేదు. అలా ఇంట్లో కూర్చుని అప్పుడే రెండేళ్ళు గడిచిపోయాయి. ఈపాటికి ఇంటర్ పూర్తి చేద్దును. ఏదైనా చిన్న ఉద్యోగం సంపాదించుకొందును. పోనీ ప్రైవేటుగానైనా చదువుకుందామన్న ఆలోచన లేకపోయిందేమిటో! అనుకుంది నిర్లిప్తంగా.

బాగా పేద కుటుంబం కావడంతో తనకి అంతగా స్నేహితులు కూడా లేరు. అన్ని బాంధవ్యాలకీ డబ్బే మూలం. అమ్మకి మేనత్త కూతురు జయలక్ష్మి మాత్రమే వుంది. ఆమె భర్తే శ్రీధరం. వాళ్ళు ఇదివరలో ఎక్కడున్నా ఎప్పుడన్నా కనబడితే పలకరింపుగా నవ్వడమేగానీ అంతగా రాకపోకలు లేవు. బంధువులు కూడా దూరంగా ఉండడానికి కారణం పేదరికమే. వ్యవసపరుడైన తండ్రితో తల్లి జీవితంలో సుఖాలనూ, భోగాలనుకాక బంధువులను కూడా దూరం చేసుకుంది. ఊరి చివర రెండెకరాల స్థలంలో గుడిసెకు మాత్రమే మిగిలింది. తాగి తాగి నాన్న పోయాడు. అప్పులకోసం ఆ స్థలం అమ్మేసింది. గుడిసె చుట్టూ అర ఎకరం మాత్రం అమ్మలేదు. టౌనుకెళ్లి సరుకులు తెస్తానన్న అమ్మ మళ్ళీ తిరిగి రానేలేదు. అమ్మ ఎక్కిన ఆటోని గుర్తు తెలియని లారీ గుద్దేసిందిట. చనిపోయిన ఇద్దరిలో అమ్మ కూడా వుంది. ఒంటరి పక్షిలా మిగిలిన తన అభాగ్య జీవితాన్ని తలచుకుని కుమిలి కుమిలి ఏడ్చింది దమయంతి.

అమ్మ పోయిన ఈ మూడురోజులు తోడుగా వున్న మంగమ్మ మామ్మ కూడా ఈ రోజు కూలిపనికి వెళ్లిపోయింది. ఎంతకాలం తన కోసం వుంటుంది? ఈ రోజు చుట్టపుచూపుగా వచ్చిన శ్రీధరం మామయ్య ఈ మాటలు ఈటెల్లా వదిలి వెళ్లిపోయాడు. తిరిగి రెండు రోజులు పోయాక వస్తాను, ఆలోచించుకోమన్నాడు.

భార్య బ్రతికుండగానే ఆమె సంసారంలో ప్రవేశించి బాధించడం ఎంతవరకు సమంజసం అని ఆలోచించుకున్న దమయంతి అతనితో పోకూడదని నిశ్చయించుకుంది. కానీ తన బ్రతుకేమిటి? తనకిప్పుడు మనస్ఫూర్తిగా సహాయం చేసేవారెవరున్నారు? అని లోలోన బాధపడింది. ఆమెకి ఏడవ తరగతిలో క్లాసు టీచరు సుగుణ మేడమ్ గుర్తొచ్చింది. ప్రతిరోజూ టౌను నుండి స్కూటరుమీద వస్తుంది. ఈ ఇంటి ముందు నుంచే వెళ్తుంది. ఆమెను చూడగానే దమయంతికి ఒక విధమైన థ్రిల్ కలుగుతుంది. ఆమె ఏదైనా సహాయంగానీ, సలహాగానీ ఇవ్వగలదనిపించింది. అలా అనిపించడానికి కారణం ఆమె ఒక టీచర్‌లా కాక పిల్లలతో ఎంతో ప్రేమగా వుంటుంది. గ్రౌండ్‌లో పిల్లలతో కలసి ఆడుతుంది. స్కూలు ఫంక్షన్స్‌లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లల్ని చక్కగా తయారుచేస్తుంది. ఆమె అంటే పిల్లలందరికీ ఆరాధన. మిగిలిన మేడమ్స్‌లా కాకుండా ఠీవిగా, మగాడిలా వుండే ఆమె అంటే దమయంతికి ఎంతో ఇష్టం. మిగిలిన మేడమ్స్ బస్సు కోసం ఈసురోమని కూర్చుంటే సుగుణ మేడమ్ బండిమీద రివ్వున పిట్టలా దూసుకుపోతుంటే 'అలా వుండాలి చక్కగా' అనుకునేది దమయంతి. ఇలా ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుండగా బయట స్కూటర్ ఆగిన శబ్దం వినిపించింది. తనకోసం వచ్చే వాళ్ళు ఎవరుంటారు? అని అనాసక్తిగా అలాగే గోడకు చేరబడి ఉండిపోయింది. లేచి చూసే ఓపిక లేదామెకు.

గుమ్మం దగ్గర అలికిడికి తలెత్తి చూస్తే ఆశ్చర్యం, ఆనందం. తాను మనసులో అనుకున్న దేవతే ప్రత్యక్షమయినట్లుగా సుగుణ మేడమ్. దమయంతిని ఆ స్థితిలో చూసిన సుగుణ హృదయం ఆమెపట్ల సానుభూతితో నిండిపోయింది. ఆనందంగా ఎగిరే పక్షి రెక్కలు విరిగి నేలపై పడినట్లుగా వున్న దమయంతిని చూసి చాలా బాధ కలిగింది. సాదాసీదాగా వుంటే కష్టపడి చదివే ఆ పిల్ల అంటే అప్పట్లో ఆమెకి ప్రత్యేక అభిమానం వుండేది. దగ్గరగా వెళ్లి తలపై చేయి వేసేసరికి కట్ట తెగిన ప్రవాహంలా ఆమె భుజంపై వాలి వెక్కి వెక్కి తనివితీరా ఏడ్చింది దమయంతి. పరిస్థితి తెలుసుకున్న సుగుణ ''నీకు నేనున్నాను. దిగులు పడకు'' అని ధైర్యం చెప్పింది.

''పోయిన అమ్మ ఎలాగూ తిరిగిరాదు. నువ్వు బెంగ పడి సాధించేదిలేదు'' అంది.

''ఏం చూసుకుని ధైర్యంగా ఉండను మేడమ్. నాకు చదువులేదు. ఆస్తి లేదు. ఆత్మీయులు లేరు'' అంది మళ్ళీ ఏడుస్తూ.

''ఇలాంటప్పుడే గుండె నిబ్బరం ఉండాలి దమయంతీ. ప్రయివేటుగా బిఎకి కట్టు. నేను వీలున్నప్పుడల్లా నీ డౌట్స్ తీరుస్తాను. ఈలోపు చిన్న పిల్లలకి ట్యూషన్స్ చెప్పు. నీకు కాలక్షేపంగానూ వుంటుంది, నీ ఖర్చులు పోతాయి. నేను రోజూ వచ్చి నిన్ను చూసి పోతుంటాను. ముందు నాకెవరూ లేరన్న భావాన్ని నీలోనుండి తీసివేయాలి సుమా! ఇప్పటివరకూ నీకు అమ్మ తోడుంది. కానీ ఆ మాట కూడా పలకని అభాగ్యురాలు ఎందరో! కనీసం నీకో గూడయినా వుంది. అది లేనివాళ్లెందరో! వాళ్ళందరికంటే నువ్వు నయం కదూ! కష్టాల్లో బేజారయిపోకుండా స్థిరంగా నిలబడగలగాలి. పరిస్థితులకు అనుగుణంగా మారి ముందుకు సాగాలి. నీ జీవితానికి నువ్వే ప్రేరణ కావా

లిగానీ ఎవరోవుంటే నన్ను దరి చేర్చుదురే అని విచారిస్తూ కూర్చుంటే ఎలా? పిరికితనంతో, భయంతో నీలో నువ్వే కుంచించుకుపోకూడదు. నీకు నా అండదండలెప్పుడూ వుంటాయి. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. ఎంత ప్రేమ కురిపించినా, ఎంత సానుభూతి చూపించినా మగవాళ్ళను మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో దరికి రానీయకు. అసహాయురాలైన ఆడపిల్లని చూస్తే ప్రతి మగాడికీ లోకువే. వాళ్ళేదైనా సాయం చేసారూ అంటే అది నీ ఒంటరితనాన్ని చూసేకానీ నీమీద ప్రేమ కాదు'' అని చెప్పాల్సిన జాగ్రత్తలన్నీ చెప్పి కొన్ని నోట్లు చేతిలో పెట్టింది.

''చూడు దమయంతీ! ఆ మంగమ్మకెవరూ లేరు కదా. నీతోనే వుంచుకో'' అని సలహా ఇచ్చి వెంట తెచ్చిన టిఫిన్ దమయంతి చేత తినిపించి వెళ్ళిపోయింది.

ఒంటరి నిశీధిలో భయకంపితయై నిలబడిన వ్వుడు ఒక వెలుగు కిరణంలా, ఒక పూల పరిమళంలా, ఒక చల్లని మలయమారుతంలా అనుభూతి నిచ్చిన ఆమె మాటలు బ్రతుకుపై ఆశను పెంచాయి. నిరాశా నిస్పృహలుపోయి ఒక విధమైన నూతనోత్తేజం చిగురించింది దమయంతిలో. ఒక మంచి మనసు, ఒక మంచి మాట ఎంతటి బలాన్నిస్తాయో ఆమె అనుభవపూర్వకంగా తెలుసుకుంది. ఆమె ఓదార్పుతో ఒక నిశ్చయానికొచ్చింది.

సాయంత్రం కూలి పని నుండి వచ్చిన మంగమ్మను ఎప్పటికీ తనతోనే ఉండి పొమ్మంటుంటే ఆశ్చర్యంగా చూసింది.


''అవును మామ్మా. నాకెవరూ లేరు. నీకూలేరు. నీకు నేను, నాకు నువ్వే తోడు. నువ్వు కూలిపనికి కూడా వెళ్ళవద్దు. నేను ప్రయివేట్లు చెప్తాను. నాకు సాయంగా వుంటే చాలు'' అంది.

''నా తల్లే, బంగారుకొండ'' అంటూ రెండు చేతులూ పట్టుకుని ముద్దు పెట్టుకుంది. ఆ అవ్వ ప్రాణం ఎంతో మురిసిపోయింది.

• • •

సహజంగా తెలివైనదీ, చురుకైనదీ అయిన దమయంతి ప్రయివేట్లు చెప్తూ చిన్నపిల్లల్ని చక్కగా ఆకట్టుకుంది. వాళ్లను చేరదీసి మంచి మార్కులు వచ్చేలా తయారు చేయడంతో చాలామంది తమ పిల్లల్ని దమయంతి దగ్గరకే పంపుతున్నారు. ఇంటి చుట్టూ వున్న ఆవరణలో మంగమ్మ కూరగాయలు వేసింది. కూలి పని మానేసి అవన్నీ అమ్ముకొచ్చేది.

పరీక్షలకు తయారవుతూనే అమ్మ నేర్పిన మిషన్ పని చేస్తూ ట్యూషన్స్ చెప్తూ తోట సంరక్షణ చూసుకుంటూ క్షణం తీరిక లేకుండా ఒక తపస్సులా ఆమె తన పనులలో మమేకమై పోయింది. సుగుణ మేడమ్ అండదండలు, సలహాలు ఆమెకెప్పుడూ ఉండేవి. అమ్మ పెళ్లికని దాచిన డబ్బుతో అమ్మేసిన స్థలం తిరిగి కొనేసింది. డిగ్రీ పూర్తయ్యి చేతికొచ్చాక సుగుణగారి




ష్యూరిటీ తో బ్యాంకు లోను తీసుకుని ఆమె సహాయంతో కొన్న స్థలంలో మరో ఇద్దరికి అవకాశం కల్పిస్తూ చిన్న కాన్వెంట్ ప్రారంభించింది. ఆహ్లాదకరమైన రంగురంగుల పూలచెట్ల నడుమ చిన్న చిన్న పర్ణశాల లాంటి ఆ కాన్వెంట్‌లో తమ పిల్లల్ని చేర్చడానికి చాలామంది ముందుకువచ్చారు. ఇప్పుడామెకు తన గురించి ఆలోచించుకునే తీరికే లేదు.

'ఆడదానికి ఆడదే శత్రువు' అంటారు కానీ 'ఆడదాన్ని మరో ఆడది మాత్రమే బాగా అర్థం చేసుకోగలదు. చేయూతనిచ్చి నిలబెట్టగలదు' అని సుగుణ మేడమ్‌గారికి మనసులోనే జోహార్లు అర్పించింది.

కాన్వెంట్ ప్రారంభోత్సవం సుగుణగారిచేత చేయించాక వంగి ఆమె పాదాలను తాకిన దమయంతిని అక్కున చేర్చుకుందామె. ఆమె కృతజ్ఞత కన్నీటి రూపంలో వస్తుంటే–

''ఛ...ఛ...ఇదేంటి దమయంతీ! ఇందులో నేను చేసిన గొప్పేముంది? నువ్వు కష్టపడి నీ జీవితాన్ని చక్కదిద్దుకున్నావు. నేను కాస్త వెనుక నిలబడ్డానంతే. 'సొంత లాభం కొంత మానుకు, పొరుగువాడికి సాయపడవోయ్' అన్న గురజాడవారి మాటలు మనం పాటిస్తే నీలాగ చాలామందే నిలదొక్కుకోగలరు. కష్టాల్లో వున్న మనిషిని ఆదుకుని చేయూతనివ్వడం సాటి మనిషి ధర్మం'' అంటూ కన్నీరు తుడిచింది.

వెన్నుతట్టి ప్రోత్సహించే మంచి మనసుల అండ ఉంటే సాధించలేనిది ఏదీ వుండదు.

'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న సూక్తి ఆమె పాలిట నిజమైంది.

★